## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- "బేటీ బచావో... బేటీ పఢావో..." ర్యక్రమం లింగ వివక్షతను రూపుమాపడంలో కీలకపాత్ర పోషించిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు.
- ముడి జనపనార కనీసమద్ధతు ధరను 5,650 రూపాయలుగా కేంద్రమంత్రి వర్గం ఈరోజు నిర్ణయించింది.
- వికసిత్ భారత్ సంకల్పాన్ని యువత ముందుకు తీసుకువెళుతుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖర్ పేర్కొన్నారు.
- మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలోని పచోరీ స్టేషన్ సమీపంలో ఈరోజు రైలు ప్రమాదం చోటు చేసుకుంది.
- యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) - 2025 సంవత్సరానికి సంబంధించి ఈరోజు నోటిఫికేషన్ విడుదలచేసింది.

========================

బేటీ బచావో... బేటీ పఢావో... కార్యక్రమం లింగ వివక్షతను రూపుమాపడంలో కీలకపాత్ర పోషించిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సమాజంలో ఒక పరివర్తన తీసుకురావడమే కాకుండా అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని పొందిందని ప్రధానమంత్రి అన్నారు. ఈ పథకం ఆడపిల్లకు విద్యతో పాటు వారి కలలను సాకారం చేసుకోవడానికి దోహదపడిందని.. బేటీ బచావో.. బేటీ పఢావో.. పథకం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు ఆయన సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. లింగనిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాల్లో లింగ సమానత్వం సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. దీనిని ఒక ఉద్యమంలా స్వీకరించిన భాగస్వాములందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆడపిల్లల హక్కులను పరిరక్షించాలని, వారి విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ ప్రధానమంత్రి కోరారు.

========================

ముడి జనపనార కనీసమద్దతు ధరను 5,650 రూపాయలుగా నిర్ణయిస్తూ... కేంద్రమంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేబినెట్ సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది. పాత్రికేయుల సమావేశంలో మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ వివరిస్తూ... 2025-26కు మార్కెటింగ్ సీజన్‌కు సంభందించి ముడి జనపనార కనీస మద్దతు ధరను 6 శాతం పెంచామని తెలిపారు. జనపనార క్వింటాల్ మద్దతు ధర 5 వేల 650 రూపాయలుగా నిర్ణయించామని, ఇది మునుపటితో పోల్చితే 315 రూపాయలు ఎక్కువని వివరించారు. దీని వల్ల ఈ పరిశ్రమపై ఆధారపడిన 40 లక్షల రైతు కుటుంబాలకు మేలు చేకూరనుందని ఆయన పేర్కొన్నారు. గతంలో నిర్ణయించిన ప్రకారం జాతీయ ఆరోగ్య మిషన్ ను మరో 2 సంవత్సరాల పాటు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలోని పచోరీ స్టేషన్ సమీపంలో రైలు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 12 మంది మృతి చెందారని, 40 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి దిగిన పలువురు ప్రయాణికులు పట్టాలు దాటుతున్న క్రమంలో వారిని కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అత్యంత ప్రతిభ కలిగి ఉన్న భారతదేశ యువత ప్రజాస్వామ్యంలో కీలకపాత్ర పోషిస్తున్నారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖర్ అన్నారు. ఈ రోజు ఢిల్లీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్‌షిప్ 8వ బ్యాచ్ విద్యార్థులతో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ ప్రపంచానికి స్ఫూర్తిదాయకం అని, గత దశాబ్దంలో ఆర్థిక పురోగమనం, మౌలిక సదుపాయాల వృద్ధి, గ్యాస్ కనెక్షన్, విద్యుత్, రహదారుల అనుసంధానం, ఆరోగ్య విద్యా కేంద్రాలు సృష్టించబడ్డాయని పేర్కొన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, 2047లో వికసిత్ భారత్ సంకల్పాన్ని యువత ముందుకు తీసుకువెళుతుందని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) - 2025 సంవతత్సరనికి గాను 979 పోస్టులకు ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనుంది. అభ్యర్థులు 21 నుంచి 32 సంవత్సరాల మధ్య వయోపరిమితి కలిగి ఉండి, ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలి. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష మే 25న జరగనుంది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 150 పోస్టులకు యూపీఎస్‌సీ మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు కూడా ఫిబ్రవరి 11వ తేదీ దరఖాస్తులు స్వీకరించనుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు ప్రపంచ నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఈ కుంభమేళాకు సంబంధించిన అంతరిక్ష చాయా చిత్రాలను ఇస్రో ఈరోజు విడుదల చేసింది. అక్కడ మౌలిక సదుపాయాల కల్పన, తాత్కాలికంగా నిర్మించిన టెంట్ హౌస్‌లు, తేలియాడే వంతెనల ఏర్పాటుతో గత కొద్దినెలలకు ఇప్పటికీ మధ్య తేడా స్పష్టమవుతోంది. 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళా ద్వారా రాష్ట్ర

ఆర్థికవ్యవస్థకు సుమారు 2 లక్షల కోట్ల రూపాయల ఆదాయం సమకూరనుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి కూడా లభిస్తుందని తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ స్విస్ ఫెడరల్ రైల్వే ప్రతినిధి బృందంతో ఈరోజు దావోస్ లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భాగంగా భద్రతా సాంకేతికతలు, నిర్వహణ పద్ధతులపై చర్చించారు. అనంతరం స్విట్జర్లాండ్ లోని సెయింట్ మార్గరేథెన్ లో ఉన్న రైల్ కోచ్ తయారీ కర్మాగారాన్ని అశ్విని వైష్ణవ్ సందర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెరుగుతున్న స్ట్రోక్ కేసులను నివారించేందుకు చర్యలు చేపడుతున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన నేషనల్ స్ట్రోక్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 500 స్ట్రోక్ యూనిట్లు పని చేస్తున్నాయని, వీటిని మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.  సకాలంలో గుర్తిస్తే స్ట్రోక్ సమస్యను నివారించవచ్చని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన బేటీ బచావో.. బేటీ పఢావో.. కార్యక్రమం 10 దశాబ్దకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం  10వ వార్షికోత్సవ వేడుకలని నిర్వహిస్తోంది. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో సాయుధ బలగాలు, పారామిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీసులు, విద్యార్థినీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా అధికారులు పాల్గొన్నారని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆడపిల్లల రక్షణ, విద్య సాధికారత కోసం ఒక దశాబ్దం పాటు "బేటీ బచావో బేటీ పఢావో" పథకం అవిశ్రాంత ప్రయత్నాలు చేసిందని పేర్కొంది. ఈ  వేడుకలు  మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు కొనసాగుతాయని ఆ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

తుర్కియేలోని బోలు ప్రావిన్స్‌లోని ఒక హోటల్‌లో నిన్న జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 76కి చేరుకుంది. నిన్న జరిగిన ఈ ప్రమాదంలో 51 మందికి పైగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై టర్కిష్ న్యాయ మంత్రి యిల్మాజ్ టుంక్ విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా హోటల్ యజమానితో సహా 9 మందిని అదుపులోకి తీసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్  75,838 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరకి 566 పాయింట్ల లాభంతో 76,404 వద్ద ముగిసింది. నిఫ్టీ 130 పాయింట్ల లాభంతో 23,155 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 25 పైసలు బలపడి 86.33 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య పురుషుల టీ-20 సిరీస్ ఈ రోజు ప్రారంభమయ్యింది. కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో తొలిత బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లాండ్ జట్టు ఇప్పటి వరకూ 18  ఓవర్ల పూర్తయ్యే సరికి 8 వికెట్ల నష్టానికి 118 పరుగుల చేసింది.